నేతన్నల ఆగ్రహజ్వాల

- కాంగ్రెస్ సర్కారు తీరుపై కన్నెర్ర
- సిరిసిల్లలో రెండో రోజుకు రిలే నిరహార దీక్ష
- రోడ్డుపై వంటా వార్పు, రాస్తారోకో
- వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- 26లోగా స్పందించకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరిక

అంబేద్కర్ చౌరస్తాలో నిరసన దీక్ష చేస్తున్న ఆసాములు, కార్మిక సంఘాలనాయకులు

రాజన్న సిరిసిల్ల, జూలై 23 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ సర్కారుపై నేతన్నలు కన్నెర్ర చేశారు. తమపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ మేరకు సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరగా, బుధవారం వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపైనే భోజనాలు చేశారు. అనంతరం రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ నెల 26లోగా సమస్య పరిష్కరించకుంటే వేలాది మంది కార్మికులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. దీక్షలకు బీజేపీ, సీపీఐ, సీఐటీయూ, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్లు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. దీక్షలో యెల్దండి దేవదాస్, గాజుల నారాయణ, సిరిసిల్ల రవి, ఏనుగుల ఎల్లయ్య, దూస అశోక్, కోడం అశోక్, బండారి అశోక్, మ్యాన సత్యనారాయణ, చేరాల అశోక్, శ్రీగాద మైసయ్య, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, కోడం రమణ పాల్గొన్నారు.

నేతన్నలు ఏం పాపం చేసిన్రు?

నేతన్నపై ప్రభుత్వం కక్షగట్టింది. వాళ్లు ఏం పాపం చేశారో చెప్పాలి. తొమ్మిది నెలల నుంచి వస్త్ర పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. కార్మికులు, ఆసాములకు ఉపాధి లేకుండా పోయింది. బతుకు భారమై పదుల సంఖ్యలో నేతన్నలు ఆత్మబలిదానాలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దురదృష్టకరం. పైగా కార్మికులకు మేలు చేసేలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను తొలగించి ఇబ్బందులు పెట్టడం తగదు. పరిశ్రమకు విద్యుత్ సమస్య పెనుశాపంగా మారింది. 10హెచ్‌పీల వరకు ఫ్రీ కరెంటు, ఆ తర్వాత వాడకానికి నాలుగో కేటగిరీ కింద 50శాతం సబ్సిడీ ఇవ్వాలి. బతుకమ్మ ఆర్డర్లు ఇవ్వాలి. వర్కర్‌టూ ఓనర్ పథకం వెంటనే అమలు చేయాలి. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్ సిరిసిల్ల సమస్యను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి.

- దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన అనంతరం సీఐటీయూ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

చీడపీడల నివారణకు సూచనలు పాటించాలి

- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

నిజామాబాద్ రైతు వేదిక ఎదుట మొక్క నాటుతున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

కోనరావుపేట, జూలై 23: పత్తితో పాటు ఇతర పంటల్లో చీడపీడల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ అన్నారు. మండలంలోని నిజామాబాద్ గ్రామంలోని రైతు వేదికలో 'రైతు నేస్తం'లో భాగంగా హైదరాబాద్ నుంచి శాస్త్రవేత్తలు పత్తిలో చీడ పీడల నివారణకు అవగాహన కల్పించగా శ్రవణ దృశ్య మాధ్యమం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంటలో రసాయనిక ఎరువుల వాడకంతో పాటు నివారణ సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. ఇక్కడ మండల వ్యవసాయాధికారి వెంకట్రావమ్మ, ఏఈవోలు పద్మ, నరేశ్, ప్రవంతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి /రుద్రంగి, జూలై 23 : హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల సాగుపై కొదురుపాక,రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు అందించారు ఇక్కడ అధికారులు, రైతులున్నారు.

ప్రభుత్వ ఐటీఐ సిరిసిల్లలో అప్రెంటీస్‌షిప్ మేళా

సిరిసిల్ల రూరల్, జూలై 23: ప్రభుత్వ ఐటీఐ సిరిసిల్ల కళాశాలలోఈ నెల 25న అ ప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నామని ప్రి న్సిపాల్ కవిత తెలిపారు. మేధా సర్వో కంపెనీ తరపున ఎలక్ట్రీషియన్‌లో 100, ఫిట్టర్‌లో 70, ఎలక్ట్రానిక్స్ మెకానిక్‌లో 50 ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25న ఉదయం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9505674905 సంప్రదించాలని కోరారు. ఐటీఐ, ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఫిట్టర్, డ్రాప్స్‌మెన్ సివిల్ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

వేములవాడ దవాఖాన సూపరింటెండెంట్ బదిలీ

వేములవాడ, జూలై 23: వేములవాడ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రేగులపాటి మహేశ్ రావు మంగళవారం బదిలీ అయ్యారు. ఏరియా హాస్పిటల్‌లో స్త్రీల వైద్య నిపుణురాలు స్వాతి జగిత్యాల అనస్తీసియా వైద్యులు తిరుపతి కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. వేములవాడ ఏరియా దవాఖానకు డాక్టర్ రాజశ్రీని బదిలీ చేశారు. మహేశ్‌రావు కుటుంబ ఆరోగ్యశాఖకు బదిలీ కాగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా ఆర్ఎంవో డాక్టర్ సంతోషిచారి బాధ్యతలు స్వీకరించారు.

ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్

బోయినపల్లి, జూలై 23: వ్యవసాయ రుణాలు మాఫీకాని రైతుల కోసం బోయినపల్లి రైతు వేదికలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్లు ఏవో ప్రణీత, బోయినపల్లి యూనియన్ బ్యాంకు మేనేజర్ మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్ష లోపు వ్యవసాయ రుణం మాఫీకాని రైతులు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, పట్టాదార్, బ్యాంకు పాసుబుక్, మొబైల్ నంబర్‌తో ఈ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

బాధిత కుటుంభానికి కొండూరి చేయూత

గంభీరావుపేట, జూలై 23: మండలంలోని సముద్రలింగాపూర్‌కు చెందిన తాటికొండ కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందగా, ఆ కుటుంబానికి కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు రూ.5వేల ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన కిష్టయ్య కుటుంబానికి కొండూరి సమకూర్చిన నగదును స్థానిక నేతలు మంగళవారం అందించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మోతె రాజిరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఎర్ర రామాంజగౌడ్, నేతలు ఎర్ర ఎల్లాగౌడ్, లక్ష్మీనర్సింహులు, తదితరులున్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- లక్ష రూపాయల్లోనూ కనీసం 50 శాతం రైతులకు రుణమాఫీ జరగలేదు
- వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

వేములవాడ, జూలై 23: మాటల గారడితో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడితో మరోసారి రైతులను మోసం చేస్తోందని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని తన నివాసంలో చల్మెడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఒకేసారి పంట రుణాలు రెండు లక్షల రూపాయల వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మూడు విడుతల్లో చేస్తామని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. మొదటి విడుతలో 6098 కోట్ల రూపాయలతో లక్ష వరకు రుణమాఫీ చేస్తున్నామని, రైతులను మోసం చేస్తున్నందున ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుతామని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో మొదటి విడుత లక్ష రూపాయల రుణమాఫీలోనే కనీసం 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. భూషణ్‌రావుపేట సహకార సంఘం పరిధిలో 550 మంది రైతులుంటే కేవలం 138 మందికి అనగా 24శాతం మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందని తెలిపారు. ఒక్క ఈసహకార సంఘంలోనే 420 మందికి రైతు రుణమాఫీ జరగలేదంటే ఏ మే రకు రైతు రుణమాఫీ చేశారో ప్రజలకు జవాబివ్వాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను డిమాండ్ చేశారు. పోరుమల్లలో 140మంది రైతులుంటే 49మందికి, నాంపల్లి పరిధిలో 413మంది రైతులుంటే 150 మందికి మా త్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రుణమాఫీ లెక్కల వివరాలు మొ త్తం ప్రభుత్వం దగ్గర ఉండగా, మళ్లీ దరఖాస్తుల పేరుతో కాలయాపన చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని ఆరోపించారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014, 2018 లో రైతు రుణమాఫీ చేశారన్నారు. 2018లో రైతు రుణమాఫీ అయిన రైతుల సంఖ్య కాం గ్రెస్ రుణమాఫీలో తగ్గడంపై సమాధానం చెప్పాలన్నారు. రైతుబంధు రుణాన్ని రుణమాఫీగా చేసి మాయమాటలతో ప్రభుత్వాన్ని న డపాలని చూస్తున్నారన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్లు అరుణ, తీగల రవీందర్ గౌడ్, సెస్ డైరెక్టర్ రేగులపాటి చరణ్‌రావు, మండలాధ్యక్షుడు గొస్కుల రవి, సహకార సంఘం అధ్యక్షుడు బండ నర్సయ్య యాదవ్, రామ్మోహన్‌రావు, నాయకులు మ్యాకల రవి, చంద్రయ్య గౌడ్, పొలాస నరేందర్, గంగం మహేశ్, ఏశ తిరుపతి, ఈర్లపల్లి రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, రాము, అంజద్ పాషా, మహేందర్‌యాదవ్, మహేశ్, సందీప్, వెంకట్‌రెడ్డి, సంధ్య ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- బీఆర్ఎస్‌వీ రాష్ట్రనేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, జూలై 23: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ఆరంభమై రెండు నెలలు గడుసున్నా విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం లో ఆంతర్యం ఏమిటో చెప్పాలన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు విద్యాసంస్థలు టీసీలు ఇవ్వకపోవడంతో అనేక చోట్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఆగస్టు 5 లోపు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేకపోతే జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్‌వీ నాయకుడు మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, రుద్రవేణి సుజిత్, వావిలాల సాయి, శ్రీనివాస్, రోహిత్, హర్షిత్, సంపత్, సిద్దార్థ, అభిషేక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేని వెంచర్లలో అక్రమ రిజిస్ట్రేషన్లు

- అధికారులకు మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్ ఫిర్యాదు

వేములవాడ, జూలై 23: వేములవాడ సబ్ రిజిస్టార్ కార్యాలయం పరిధిలో అనుమతి లేని అక్రమ వెంచర్ల రిజిస్ట్రేషన్లు చేయడమే కాకుండా గజానికి రూ.200 అక్రమంగా వసూలు చేస్తూ విధుల దుర్వినియోగాన కి పాల్పడుతున్నాడని వేములవాడ సబ్ రిజిస్టర్ అధికారిపై మాజీ ఎంపీపీ రంగు వెంకటేశ్ గౌడ్ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాడు. అయితే వేములవాడ సబ్ రిజిస్ట్రార్ పరిధిలో దాదాపు 54 డాక్యుమెంట్లు అనుమతి లేని వెంచర్లలో చేశారని ఇందుకు ఒక గజానికి రూ.200 చొప్పున ఒక 150 గజాల ప్లాటు రూ.30 వేలను అక్రమ పద్ధతిలో తీసుకొని రిజిస్ట్రేషన్ చేశాడని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఐజీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, వేములవాడ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమ రిజిస్ట్రేషన్లపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం కార్యాలయంలో తనిఖీ నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈవిషయం వేములవాడ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

కోనరావుపేట ఎంపీవోగా ఆరిఫ్

కోనరావుపేట, జూలై 23: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా మహమ్మద్ ఆరిఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీవో మీర్జా తంగళ్లపల్లి మండలానికి బదిలీ కాగా ఇల్లంతకుంట మండలంలో పనిచేస్తున్న ఆరిఫ్ కోనరావుపేటకు బదిలీపై వచ్చారు.

సర్టిఫికెట్ల పరిశీలన

వేములవాడ రూరల్, జూలై 23: వేములవాడ మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యాలయంలో ఎంఈవో బన్నాజీ సర్టిఫికెట్లను పరిశీలించి నమోదు పత్రాలను స్వీకరించారు. ఇక్కడ సీఆర్పీలు, ఉపాధ్యాయులున్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, జూలై 23: ప్రయాణికులు, విద్యార్థులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు కోరారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌ను మంగళవారం సిబ్బందితో కలిసి సందర్శించారు. సిరిసిల్ల డిపో నుంచి గంభీరావుపేటకు నడుస్తున్న ఆయా బస్సు సర్వీసులు, సమయపాలన, టార్గెట్ అంశాలపై ఆరా తీశారు. ఇక్కడ ఆర్టీసీ సిబ్బంది బోల్ల విజయ్‌కుమార్, చంద్రయ్య, తదితరులున్నారు.

వీరగోని చైతన్యగౌడ్‌కు డాక్టరేట్

వేములవాడ టౌన్, జూలై 23 : వేములవాడ పట్టణానికి చెందిన వీరగోని చైతన్యగౌడ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెడ్‌డీ పట్టా సాధించాడు. రాజన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న సంస్కృత కళాశాలలో డిగ్రీ వరకు చదువుకొని అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ సంస్కృతం, తెలుగు పట్టా సాధించడమే కాకుండా ఎంఫిల్ చేశానని, నేడు పీహెచ్‌డీ సాధించడం సంతోషంగా ఉందని చైతన్యగౌడ్ తెలిపారు. చైతన్య పీహెచ్‌డీ సాధించడంపై సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

రుద్రంగి, జూలై 23: రాష్ట్రీయ బాల్ స్వస్థ్యలో భాగంగా మంగళవారం రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు వైద్యాధికారులు ప్రభాకర్, అభినయ వైద్య పరీక్షలు చేశారు. కళాశాలలో 131 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామని తెలిపారు. ఇక్కడ కళాశాలలో ప్రిన్స్‌పాల్ గంగయ్య, ఏఎన్ ఎంలు రాజేశ్వరి, దివ్య, వైద్య సిబ్బంది లక్ష్మీనర్సు, లక్ష్మి, తదితరులున్నారు.

మానసిక స్థైర్యం కోల్పోవద్దు

రాజన్న సిరిసిల్ల, జూలై 23 (నమస్తే తెలంగాణ) : మానసిక స్థైర్యం కోల్పోకుండా మనోధైర్యంతో ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్ పున్నం చందర్ నేతన్నలకు సూచించారు. స్థానిక నెహ్రూనగర్ అంబాభవాని ఆలయ సమావేశ మందిరంలో మంగళవారం నేత కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వస్త్ర పరిశ్రమ సంక్షోభం, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఏవైనా సమస్యలుంటే ప్రభుత్వ దవాఖానలోని మానసిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఇక్కడ సీనియర్ జర్నలిస్టు మచ్చ ఆనంద్, తదితరులున్నారు.

మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల రూరల్, జూలై 23: తంగళ్లపలి మండలంలో మద్యం తాగి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతోపాటు పేకాట రాయుళ్లకు సిరిసిల్ల కోర్టులో మెజిస్ట్రేట్ ఉదయశ్రీ జరిమానా విధించారని తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి వెయ్యి చొప్పున, మరో నలుగురికి రూ.1500 చొప్పున, ఒకరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 9 మందికి రూ.210 చొప్పున, పేకాడిన ముగ్గురికి రూ.900 జరిమానా విధించారని పేర్కొన్నారు.

రాజన్న సన్నిధిలో సేవచేయడం అదృష్టం

వేములవాడ రూరల్, జూలై 23: రాజన్న సన్నిధిలో సేవచేయడం అదృష్టంగా భావిస్తున్నానని వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ బోనాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ ఆర్టీసీ డిపోలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎం మాట్లాడుతూ, శ్రావణ మాసంలో కొండగట్టు, ధర్మపురి తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లే బస్సులపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట/చందుర్తి, జూలై 23: అక్కపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో, చందుర్తి మండలం సనుగుల గ్రామంలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున (బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరా యం నెలకొంటుందని సెస్ అధికారులు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★I, SHANEGARAPU KUMMARE NARSAIAH, S/o. SHANEGARAPU KUMMARE RAJAIAH (Old name) R/o. H.No.1-1-82, Kummariwada, Gambhiraopet (V&M), Siricilla Dist. I have changed my name as SANIGARAPU NARSAIAH S/o. RAJAIAH (New name)
NTZ-340076

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

గ్రామ దేవతలకు జలాభిషేకం

జలాభిషేకం నిర్వహిస్తున్న మహిళలు

వీర్నపల్లి, జూలై 23 : వర్షాలు కురవాలని ఊరంతా ఒక్కటయ్యారు. గ్రామ దేవతలను వేడుకుంటూ జలాభిషేకాలు నిర్వహించారు. వరుణదేవుని రాకకై ఊరు ఊరంతా కదలడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది. విస్తారంగా వర్షాలు కురిసి జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని మహిళలు నీళ్ల బిందెలతో తరలివెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్, ఎల్లమ్మ ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.

బద్దిపోచమ్మకు ఆషాఢమాస బోనాలు

బోనాలతో ఆలయానికి వెళ్తున్న వ్యాపార సంఘం సభ్యులు

వేములవాడ టౌన్, జూలై 23: ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర వ్యాపార సంఘం ఆధ్వర్యంలో బద్దిపోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. సంఘం సభ్యులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వ్యాపారుల సంఘం అధ్యక్షుడు పిన్నింటి హన్మాండ్లు, గౌరవాధ్యక్షుడు ఎల్ల పోశెట్టి, కార్యదర్శి కూస హరీశ్, ఉపాధ్యక్షుడు కూర దేవయ్య, ముద్రకోల లింబాద్రి, కోశాధికారి నక్క వేణు, చేని ఎల్లపతి, ఆడెపు శ్రీనివాస్, మంత్రి రమేశ్, గంప రాజు, బొడ్ల రమేశ్, చాడ రాజేశ్, వంగల శ్రీధర్, బెద్రం తిరుపతిరెడ్డి, సత్యంరావ్, జ్ఞానేశ్వర్, నవీన్, గణేశ్, శంకర్, రాజమౌళిలున్నారు.

ముస్తాబాద్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- సీఎంకు పోస్టు కార్డులతో విద్యార్థుల వినతి

పోస్ట్ కార్డులతో నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు

ముస్తాబాద్ జూలై 23 : మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్‌కార్డులతో విన్నవించారు. డిగ్రీ కాలేజీ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని డిగ్రీ కళాశాల సాధన కమిటీ అధ్యక్షుడు చింతోజి బాలయ్య పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. కాలేజీ మంజూరు చేసే వరకు నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. ఇక్కడ నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులతో పాటు సాధన కమిటీ అధ్యక్షుడు చింతాజి బాలయ్య ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లంతకుంట, జూలై 23 : మండలంలోని అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయ ఆవరణలో లడ్డూ, పులిహోర, కొబ్బరి ముక్కలు జమచేసుకునేందుకు వేలంపాట నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో మారుతీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి

సిరిసిల్ల టౌన్, జూలై 23: పోలీస్‌స్టేషన్‌లో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూసుకోవడంతోపాటు విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేరస్తులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలను వినియోగించుకోవాలన్నారు. పెండింగ్ కేసులపై సమీక్షలు నిర్వహిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీ షీటర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు కృష్ణ, మొగిలి శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మధుకర్, శ్రీనివాస్, శ్రీలత, తదితరులున్నారు.

సంక్షేమ వసతి గృహం తనిఖీ

చందుర్తి, జూలై 23: మండల కేంద్రంలోని సంక్షేమ వసతి గృహాన్ని మంగళవారం ఆర్డీవో రాజేశ్వర్ సందర్శించారు. శిథిల భవనంలో కొనసాగుతున్న అద్దె భవనాన్ని పరిశీలించి ఇతర భవనంలోకి మార్చాలని ఆదేశించారు. చందుర్తి ఎస్సీ హాస్టల్ 20 సంవత్సరాలు నుంచి పురాతన భవనంలో కొనసాగుతుండగా ఆ భవనం శిఖలావస్థకు చేరడంతో గ్రామంలో మోతె రాములకు చెందిన మరో అద్దె భవనాన్ని హాస్టల్ కోసం గతంలో పరిశీలించారు, ఈ భవనం హాస్టల్‌కు అనుకూలంగా ఉండడంతో వెంటనే మార్చాలని ఆర్డీవో ఆదేశించారు. ఇక్కడ త హసీల్దార్ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి విజయలక్ష్మి, వార్డెన్ రవీంద్ర స్వామి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మహంకాళీ అమ్మవారికి బోనాలు

గంభీరావుపేట, జూలై 23: మండల కేంద్రంలోని పూసల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహంక